క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని మధురవాడకు చెందిన దండు పద్మనాభరాజు అనే దాత లక్ష 116 రూపాయిలు విరాళం ఇచ్చారు. దేవస్థానం తరఫున ఈవో త్రినాథరావు దాతకు బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ సూపరింటిండెంట్ సునీల్ పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం



అధ్వానంగా మారిన వెంకటాపురం రహదారి

పరవాడ: వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం రహదారి పూర్తిగా దెబ్బతింది. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వాడచీపురుపల్లి ఎస్సీ వసతి గృహం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల నిడివి కలిగిన రహదారి రాళ్లు తేలి నడవడానికి కూడా వీల్లేని దుస్థితికి చేరింది. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తమ విధులకు వెళ్లడానికి నానా పాట్లు పడాల్సి వస్తోంది. తమ ఇబ్బందులను గుర్తించి రోడ్డు మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రమ్మీ ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు సిమ్మన్నగారి ఊరు శివార్లలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న వారిలో ముత్యాలమ్మపాలేనికి చెందిన మైలపల్లి బంగార్రాజు, మైలపల్లి పోలరాజుతో పాటు తంతడి గ్రామానికి చెందిన చోడిపల్లి పైడిరాజు ఉన్నారు. సిమ్మన్నగారి ఊరు సమీపంలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్నట్లు బుధవారం సాయంత్రం 7గంటల సమయంలో సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు. ఈ దాడిలో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడడానికి ఉపయోగించిన 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

ఈవీఎం గొడౌన్ సందర్శన



ఈవీఎం గొడౌన్‌లో యంత్రాల రికార్డు పరిశీలిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం పక్కన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచే గొడౌన్‌ను బుధవారం భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి సందర్శించారు. ఈవీఎం యంత్రాలను పరిశీలించారు. ఇటీవల బెంగళూరు నుంచి తీసుకొచ్చిన వీవీ ప్యాట్లను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో రూరల్ రెవెన్యూ అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో పాము కలకలం



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో పాము కలకలం రేపింది. బుధవారం ఉదయం ఆలయం వెనుక ఉన్న ఇంట్లో పాము కనిపించింది. దీంతో ఆ ఇంట్లోని కుటుంబీకులు భయాందోళన చెందారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కిరణ్‌కుమార్ పామును పట్టుకున్నారు.అటవీశాఖ అధికారులకు అప్పగిస్తానని కిరణ్ తెలిపారు.

చంద్రయాన్ జాబిల్లిని చేరిన వేళ..

ఆనంద హేల

- ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షల వెల్లువ



ప్లకార్డులతో కేజీబీవీ విద్యార్థుల విజయోత్సవం



చంద్రయాన్-3 నమూనాతో పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థినులు

సబ్బవరం: 40 రోజుల ఉత్కంఠకు తెర దించుతూ విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై అడుగిడడంతో అంతటా సంబరాలు చేసుకున్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జయహో భారత్.. సాహో ఇస్రో అంటూ యువకులు, విద్యార్థులు జాతీయ జెండాలు రెపరెపలాడించారు. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ దిగుతున్న ప్రక్రియను ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో అనేక మంది టీవీలకు అతుక్కుపోయారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీన్లపై ప్రసారాన్ని వీక్షించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ దిగిన వేళ అంతటా చప్పట్లతో మార్మోగాయి. సబ్బవరం కేజీబీవీలో చంద్రయాన్-3 ప్రయోగాన్ని విద్యార్థులు టీవీల్లో వీక్షించారు.ప్రయోగం విజవయంతం ఆనంతరం విద్యార్థులంతా ప్లకార్డులను ప్రదర్శిస్తూ విజయోత్సవం నిర్వహించారు.కేజీబీవీ ఎస్‌వో మృదుల ఆధ్వర్యంలో విజయోత్సవాన్ని నిర్వహించారు.



ప్రయోగాన్ని టీవీలో వీక్షిస్తున్న కేజీబీవీ విద్యార్థులు



నరవ జెడ్పీ పాఠశాలలో వీక్షిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చంద్రయాన్-3 నమూనా

హర్షాతిరేకాలు

సింహాచలం: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం చంద్రయాన్ -3 నమూనా ప్రదర్శన నిర్వహించారు. ఇస్రో సైంటిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంతో ప్రపంచలో భారతదేశ కీర్తిప్రతిష్టలు మరింత పెరిగాయన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగిన తొలి దేశంగా భారత్ నిలుస్తుందన్నారు. సైంటిస్టులు ఎంతో ప్రతిభ కనబరిచారని కొనియాడారు.

నరవ జెడ్పీ హైస్కూల్లో ..

సింహాచలం: చంద్రయాన్-3 ల్యాండింగ్ ఘట్టాలను బుధవారం పెందుర్తి మండలంలోని నరవ జెడ్పీహైస్కూల్, చింతలగ్ర హారం జెడ్పీ పాఠశాలలో విద్యార్థులు వీక్షించారు. ఈ మేరకు పాఠశాలలో ప్రత్యేకంగా స్క్రీన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో హర్షం వ్యక్తం చేశారు.

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

పరవాడ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు కొనియాడారు. ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేశారన్నారు. తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు చల్లా కనకరావు, రెడ్డి శ్రీనివాసరావు, కావలి రాజు, వాసు, వర్రి హరి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ప్రకాశం పంతులు

సబ్బవరం: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయుడని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి అన్నారు. కళాశాలలో ప్రకాశం పంతులు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకాశం పంతులు జాతీయ నాయకత్వంలో,స్వాతంత్ర్య సమరంలో పోషించిన పాత్ర యువతకు ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు రామకృష్ణ,గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఏయూ డీజీఎంఎస్ విభాగంలో నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్స్ మ్యూచువల్ ఫండ్స్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ సదస్సులో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, తద్వారా పెట్టుబడులు, నష్టాల నియంత్రణ అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. పెట్టుబడులు పెట్టే వారికి తగిన సూచనలు ఇస్తూ, మ్యూచువల్ ఫండ్స్ ఎంత వరకు శ్రేయస్కరం అనే అంశాన్ని వివరించారు. ఐఎస్‌సీఐ పూర్వ సీఈవో డాక్టర్ ఇ.ఎస్.రావు మాట్లాడుతూ దేశంలో మౌలిక రంగాలు గణనీయంగా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు మాట్లాడుతూ యువత చిన్నతనం నుంచి పొదుపు చేయడం అలవాటుగా చేసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్ట్రాటడిగ్స్ ఎడ్యుకేషన్ సీఈవో బి.త్యాగరాజన్ మాట్లాడుతూ బీఎఫ్ఎస్ఐ రంగంలో ఉపాధి అవకాశాలను వివరించారు. సదస్సు సంచాలకుడు ఆచార్య బి.మోహన వెంకటరామ్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రథమ మేయర్ సేవలు మరువలేనివి



ఎస్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

సీతమ్మధార: విశాఖపట్నం ప్రథమ మేయర్ ఎస్ఎస్ఎన్ రెడ్డి సేవలు మరువలేనివని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఎన్ఎస్ఎన్ రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా బుధవారం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా సెంట్రల్ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1981లో ప్రథమ మేయర్‌గా ఎస్ఎస్ఎన్ రెడ్డి విశాఖ నగరాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన హయాంలో రోడ్ల విస్తరణ, తాగునీరు, విద్యుత్తు, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమిచ్చారన్నారు. జనతా పార్టీ తరఫున 1978లో శాసనసభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎన్ రెడ్డి స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, కుటుంబ సభ్యులు నీలాపు స్వర్ణలత, నీలాపు సుధీర్‌రెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, వేమన సంక్షేమ సంఘం సభ్యులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

అగనంపూడి: అగనంపూడి లయన్స్‌క్లబ్ నూతన కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. అగనంపూడిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా మిత్తిపాటి జగదీష్, కార్యదర్శిగా ఆడారి వెంకటకృష్ణ, కోశాధికారిగా యార్లగెడ్డ నాగ దుర్గా ప్రసాద్, జిల్లా చైర్‌పర్సన్లుగా కిడిమి హనుమంతరావు, గుడే సుశీలా గజేంద్రరావు, పొన్నగంటి నాగేశ్వరరావు, డైరెక్టర్లుగా డాక్టర్ వి.వి.రామారావు, గోరు గోవిందరావు, ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి ఎం.మస్తాన్‌రెడ్డి, బత్తుల కాళిదాస్ ప్రమాణస్వీకారం చేశారు. క్లబ్ పూర్వ గవర్నర్ లయన్ డి.రాఘవేంద్రరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గాజువాక, కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ, అనకాపల్లి కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ఏడో రోజుకు శ్రావణలక్ష్మీ పూజలు

శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న లక్ష్మీ పూజలు బుధవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



923వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 923వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

భారీ గణేషుడి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం



దొండపర్తి రామాలయం వద్ద పూజలు చేస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం దొండపర్తిలోని రామాలయం వద్ద భారీ గణనాథుడి విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, టీం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ ఖరగ్‌పూర్‌కు చెందిన కళాకారుడు శక్తి పాల్ బృందం చేత భారీ విగ్రహం తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది 102 అడుగుల గణపతి ఏర్పాటు చేసినట్లు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. 21 రోజుల పాటు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సర్వేశ్వరరెడ్డి అండ్ టీం సొంత నిధులు రూ.5 లక్షలతో భారీ గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధురెడ్డి, అజయ్ రెడ్డి, శివ, గురుమూర్తిరెడ్డి, సతీష్, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ

సబ్బవరం: విద్యార్థి దశ అనేది ఒక రంగుల కల లాంటిది.. ఆ సమయంలో ఎలాంటి బలహీనతలను దరి చేరనీయకుండా విద్యాభ్యాసం పూర్తి చేసి తమ తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు.దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మురళీ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితంలో చాలా ముఖ్యమైన దశ అన్నారు. ఈ దశలో అనేక రకాల బలహీనతలు విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. అలాంటి వాటిలో మాదకద్రవ్యాల వినియోగం ఏంతో ముఖ్యమైనదని, ఇలాంటి బలహీనతల్లో వెళ్లకుండా విద్యార్థులు తమను తాము నియంత్రించుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్స్ యాక్ట్-1985 ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం,వాటిని కలిగి ఉండటం చట్టవ్యతిరేకమైన చర్య అని తెలిపారు. ప్రజల్లో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14500తో కూడిన హోర్డింగ్‌లను కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా నివారణలో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలోని 8 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ, రిజిస్ట్రార్ డాక్టర్ జోగి నాయుడు,పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ రంగనాథం, ఎస్ఐ ఎల్. సురేష్, అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం:శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సర్పంచ్‌తో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణితో దురుసుగా ప్రవర్తించిన పల్లి వెంకటరమణ అనే వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పారావు చెప్పారు. పెదముషిడివాడలో బుధవారం చేసిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పల్లి వెంకటరమణ అనే వ్యక్తి ఈ నెల 20న సర్పంచ్ ఇంటి ముందు నిలబడి ఆమె అనుమతి లేకుండా ఫొటోలు చిత్రీకరించాడని చెప్పారు. తన అనుమతి లేకుండా ఫొటోలు తీయడం తగదని సర్పంచ్ నాగమణి అభ్యంతరం చెప్పడంతో ఆమెపై సదరు వ్యక్తి దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దుర్భాషలాడుతూ గట్టిగా నెట్టివేయడంతో తన తల్లి కింద పడిపోయారని అప్పారావు వివరించారు. తన తల్లిని నెట్టివేసిన సదరు వ్యక్తిని నిలదీయడంతో తనపై కూడా అతను దురుసుగా ప్రవర్తించాడని చెప్పారు. అక్కడే ఉన్న స్థానికులు కల్పించుకొని ఇరువర్గాలను సముదాయించి ఘర్షణను నివారించారన్నారు. తమపై దురుసుగా ప్రవర్తించిన పల్లి వెంకటరమణపై పరవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు వివరించారు. మీడియా సమావేశంలో సర్పంచ్ పల్లా నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకులు నందవరపు శ్రీనివాసరావు, ఒమ్మి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో అమృత యోగా సంస్థ ఎంవోయూ



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో అమృత యోగా సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. బుధవారం ఒప్పంద పత్రాలపై ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అమృత సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఎ.ఇందుమణి సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఏయూ సూచించిన విధంగా ఏడాది కాల వ్యవధితో పీజీ డిప్లమో ఇన్ యోగా, ఆరు నెలల కాల వ్యవధితో డిప్లమో ఇన్ యోగా కోర్సులను అమృత సంస్థ నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఆలయం వద్ద పసుపు నీటి బిందెలతో బారులు తీరిన భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం కోసం పసుపు నీటి బిందెలతో భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ముందుగా ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతో పాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు తమ స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించి, అందుబాటులో గల వసతులు, పరికరాలను పరిశీలించారు. డీజిల్ లోకోలకు క్లచ్ ఓవర్ హాలింగ్ చేసే పవర్ అసెంబ్లీ బెంచ్‌ను పరిశీలించారు. అనంతరం స్మాల్ మోటార్ బెంచ్ సెక్షన్, మెటలర్జికల్ ల్యాబ్, న్యూ షెడ్‌లను పరిశీలించారు. ఆయా విభాగాల్లో గల సీనియర్ సూపర్‌వైజర్స్‌తో డీఆర్ఎం మాట్లాడారు. డీజిల్ లోకో షెడ్ నిర్వహిస్తున్న వివిధ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.